క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, పలు శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు సాయినగర్ కాలనీ రోడ్డుకు శంకుస్థాపన

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ సాయినగర్ కాలనీలో 50 అడుగుల రోడ్డు విస్తరణ,నూతనంగా రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు,నాయకులు,పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. చాతుర్మాస్య పూజల్లో ఈ పూజలు చేశారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపు అవసరం



రిసోర్స్ పర్సన్స్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీసీఎంఎస్ విభాగంలో మేక్ యువర్ సెల్ఫ్ కార్పొరేట్ రెడీ అంశంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక జ్ఞానంతో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, వ్యక్తిత్వం, వ్యవహార శైలి వంటివి ఉద్యోగ సాధనలో ఎంతో కీలకమన్నారు. ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు వెళ్లే సమయంలో ఆ సంస్థకు సంబంధించిన వివరాలపై అవగాహన ఉండాలని సూచించారు. రూబికస్ సంస్థ ప్రతినిధులు అమర్ నాగేంద్ర, పల్లవి, కోమలి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను విభాగం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్‌గణేష్, విభాగ ఆచార్యులు ఎస్.సాంబశివరావు, ప్రభాకర్, బి.సుబ్బయ్య, రంజిత్, సెరస్స్, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.05 కోట్లతో రాయిచెరువు అభివృద్ధి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- కోటనవరలో విస్తృత పర్యటన



కోటనరవలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, అధికారులు, నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలోని రాయి చెరువును రూ.1.05 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. కోటనరవ కాలనీలో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. రహదారులు, మురుగు కాల్వల సమస్యలను ఆయన పరిశీలించారు. ఇక్కడి ప్రధాన మురుగు కాల్వలో మురుగు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. దీనిపై కాల్వ నిర్మాణానికి గల అవకాశాలను స్వయంగా పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు కావాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ కాలనీలో రోడ్లు అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే రాయి చెరువును అభివృద్ధి చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేసి వద్దకు వెళ్తామని తెలిపారు. ఆయనతో పాటు జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, వార్డు ఇన్‌చార్జ్ జి. మహాలక్ష్మి నాయుడు, వార్డు అధ్యక్షుడు దాడి నూకరాజు, మళ్ల నూకప్పారావు, ఆళ్ల పైడిరాజు, మళ్ల రమణ, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా పరిశీలన

ఆర్‌వో సత్యపద్మ



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,ఆర్‌వో సత్యపద్మ

సబ్బవరం: మండలంలో ఓటర్ల జాబితా పరిశీలన, ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యపద్మ బీఎల్‌వోలను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో ఓటర్ల జాబితా పరిశీలనపై ఆమె మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేను ఈ నెల 21 నాటికి సమగ్రంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు అంతా రికార్డులు నిర్వహించాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సందేహాలు, సమస్యలపై తమను సంప్రదిస్తే నివృత్తి చేస్తామని తెలిపారు. సర్వేపై పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలను ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడుతో పాటు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ జయరామ్ పుట్టినరోజు



భగవాన్ జయరామ్ దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం పినగాడిలోని ఆయ స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ భగవాన్ జయరామ్ దంపతులను పుష్పమాలతో అభినందించారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ దేవుడి చిత్రపటం అందజేశారు. అలాగే పెందుర్తి జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, మాజీ ఎంపీటీసీ ఉప్పిలి కనకరాజు, 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు తదితరులు భగవాన్ జయరామ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

దేశపాత్రునిపాలెంలో అంధకారం



దేశపాత్రునిపాలెం రైల్వే కూడలి వద్ద వెలగని హైమాస్ట్ లైటు

పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్‌రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు, గ్రామ ప్రజలు అంధకారంలో అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రైల్వే వంతెన కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్ కొంత కాలం నుంచి వెలగడం లేదు. ఫలితంగా కూడలిలో అంధకారం వల్ల ప్రయాణికులు అగచాట్లకు గురికావాల్సి వస్తోంది. రాత్రి సమయంలో ఎన్టీపీసీ నుంచి బూడిద సరఫరా చేసే భారీ వాహనాలతో కూడలి ఎల్లప్పుడు రద్దీగా ఉండడం వల్ల యలమంచిలి, గాజువాక ప్రాంతాల నుంచి రాకపోకలు వారు ఇబ్బంది పడుతున్నారు. వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగే విధంగా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

జర్నలిజం విద్యార్థులకు దిశానిర్దేశం



జర్నలిజం విభాగ విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను పలు ఉదాహరణలతో వివరించారు. జర్నలిజం కోర్సును పూర్తిచేసే సమయానికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం విభాగం నుంచి నూతన స్టార్టప్ సంస్థలు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ నుంచి ప్రచురితమవుతున్న వార సంచిక ఏయూ లుక్స్ తీర్చిదిద్దడంలో యువత తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తూ ఏయూ లుక్స్ విస్తరణలో భాగం కావాలని ఆహ్వానించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం ఎంతో కీలకమన్నారు. ఏయూ లుక్స్ సంచిక వేలాది మందికి చేరువవుతోందని, రానున్న కాలంలో మరిన్ని మార్పులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ వినయ్ కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు కార్మిక సంఘాల నివాళి



స్టీల్‌ప్లాంట్‌లో గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ప్రజా గాయకుడు గద్దర్‌కు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నివాళి అర్పించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదన్నారు. పోరాట కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎన్. రావు మాట్లాడుతూ ఏ ఉద్యమంలోనైనా ప్రజలను మమేకం చేసి తద్వారా పోరాటాలను నిర్వహిస్తే ఆ పోరాటం విజయవంతం అవుతుందని గద్దర్ నిరూపించారన్నారు. జీవిత కాలం ప్రజా చైతన్యం కోసం గద్దర్ కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఓబీసీ సంఘం నాయకులు బి. అప్పారావు మాట్లాడుతూ గద్దర్ తన పాట, ఆటతో ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమాలకు ఊపిరి అందించారన్నారు. నాయకులు జి.గణపతిరెడ్డి, సురేష్‌బాబు, కె. పరంధామయ్య, రామకృష్ణ, కామేశ్వరరావు, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు బలి



908వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం కుటిల రాజకీయంతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనివల్ల అమాయకులైన కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 908వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపాల్సిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

డీజీఆర్ అధికారి సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీ సెటిల్‌మెంట్ అధికారి కమాండర్ యువరాజు సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో వివిధ అంశాలపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులు నూతన ఉపాధి అవకాశాలు పొందేలా ఏయూ అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సులు దోహదపడతాయన్నారు. త్వరలో 1000 మందికిపైగా రక్షణ రంగాల సిబ్బంది ఏయూలో శిక్షణకు హాజరవుతారన్నారు. అనంతరం ఏయూలో నిర్వహిస్తున్న పీఆర్‌సీ తరగతులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున యువరాజును సత్కరించారు.

శ్రావణ సంగీతోత్సవాలు ప్రారంభం



కూచిపూడి నృత్యాలతో అలరిస్తున్న యువతులు

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీతోత్సవాలు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కిరణ్మయి నృత్యాలయ విద్యార్థినులు నాట్య మయూరి జీవన కిరణ్మయి నృత్య దర్శకత్వంలో అన్నమాచార్య, రామదాసు కీర్తనలతో కూడిన భక్తిగీతాలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12, 13వ తేదీల్లో విద్యార్థులకు డ్రాయింగ్, కీర్తనలు, కథల పోటీలు జరుగుతాయన్నారు. 15వ తేదీ విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేస్తామన్నారు. దివంగత డాలర్ శేషాద్రిని స్మరిస్తూ డాలర్ ఆకృతిలో బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

గాజువాక: ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు కార్యదర్శి రామ్మూర్తి తెలిపారు. టెక్ మహీంద్ర సహకారంతో నిర్వహించనున్న ఈ శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 29 ఏళ్లలోపువారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్, బేసిక్ నెట్ వర్కింగ్ కాన్సెప్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, ఎక్స్ఎంఎల్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, ఐటీఈఎస్/బీపీవో, సీఆర్ఎస్ కోర్సుల్లో శిక్షణ ఉంటుంది.

అధ్యాపకులతోనే సామాజిక మార్పు



అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంలో మంచి మార్పులు తీసుకువచ్చే శక్తి అధ్యాపకులకు ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక అభివృద్ధికి దోహదకారిగా అధ్యాపకులు నిలవాలన్నారు. వైవిధ్యమైన జ్ఞానాన్ని కళాశాలలో విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులకు తగిన మార్గదర్శకం అందించేలా ఉండాలని సూచించారు.భారత్ విశ్వగురువుగా ఆవిర్భవించాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పలు గ్రామాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య



ముత్యాలమ్మపాలెంలో కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య అన్నారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసిన పాలు, వేరుశనగ చక్కీలు, బియ్యం, కోడిగుడ్లు, బెల్లం, రాగిపిండి, అటుకులు, కర్జూరం, కంది పప్పు వంటి సరుకులను నాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆమె లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, ఉప సర్పంచ్ ఆర్.ముత్యాలునాయుడు, నాయకులు కె.యమహానాయుడు, పంచాయతీ కన్వీనర్ దొడ్డి రాజేష్, గృహ సారథులు అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది త్రివేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, కుమారి, పార్వతి, కమల, వరలక్ష్మి, గోవిందమ్మ పాల్గొన్నారు.

- ముత్యాలమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు ప్రభుత్వం అందజేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు, గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్.ముత్యాలరాణి, ఎస్.మహేశ్వరి, ఎస్.రమాదేవి, ఎస్.ముత్యాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఎస్.ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు పాల్గొన్నారు.

అధ్వానంగా కారిడార్ రోడ్డు



గుంతలతో నిండిన ఎన్టీపీసీ కారిడార్ రహదారి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మించిన ఎన్టీపీసీ-లంకెలపాలెం కారిడార్ రహదారి అధ్వానంగా మారింది. సింహాద్రి పవర్ ప్లాంటు నుంచి లంకెలపాలెం వరకు సుమారు 7 కిలోమీటర్ల రహదారిని కొన్నేళ్ల కిందట వేశారు. ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి బూడిద తరలించే భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించడం వల్ల రహదారి గోతులమయంగా మారింది.దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం పడినా రహదారి మొత్తం బురదమయంగా మారుతోంది. దీంతో రహదారిలో రాకపోకలు సాగిస్తున్న కలపాక, గొల్లలపాలెం, పి.బోనంగి గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీపీసీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా దీక్ష

మల్కాపురం : ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక విధానాల వలన సామాజ్యులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష యూనియన్ల నాయకులు నక్క లక్ష్మణరావు యాదవ్, భోగవల్లి నాగభూషణం, కె.పెంటారావు, కె.సత్యనారాయణ ఆరోపించారు. అఖిల పక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు మల్కాపురం, హెచ్‌పీసీఎల్, కల్యాణి గేటు వద్ద మంగళవారం ఉదయం క్విట్ మోదీ.. సేవ్ ఇండియా దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ల ప్రతినిధులు మాట్లాడుతూ 9 ఏళ్ల మోదీ పాలనలో దేశానికి జరిగిన లాభం కంటే నష్టమే ఎక్కువన్నారు. ఆయన పాలనలో కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని, కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ, అంబానీలకు సేవ చేయటం మానేసి దేశ ప్రజల సంక్షేమానికి మోదీ కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో అఖిలపక్ష యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఓటర్లకు తమ నివాస ప్రాంతంలోనే ఓటు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్లకు తాము నివాసముంటున్న ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలోనే ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఓటరు జాబితాలపై ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఆయన రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్‌కు, ఆ ప్రాంతానికి కుదిరే పార్ట్ పేరును, సెక్షన్ పేరును సర్వే చేయించి వచ్చేవారం పార్టీలకు తెలియజేస్తామని తెలిపారు. దీని వల్ల అందరికీ తాము నివాసం ఉండే ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలోనే ఓటు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ ఓటర్ల నమోదు అధికారి, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 9 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు వైటీ దాస్, నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద అఖిలపక్ష యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో కణితి అప్పలరాజు, బైరెడ్డి గురప్ప, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ ఉన్న వారికే ఉద్యోగాలు

- బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు
- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : ఇటీవల విశాఖ ఉమ్మడి జిల్లా పరిధిలో నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని కొందరు వ్యక్తులు వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసి వారికి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని, నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలతోపాటు ఏ కేడర్ ఉద్యోగాలు అయినా సంబంధిత కోర్సులో వచ్చిన మార్కుల ఆధారంగానే నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. మరే ఇతర మార్గాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం లేదని, అందువల్ల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పి డబ్బులు వసూలు చేసేవారి పట్ల అప్రమతంగా ఉండాలని కోరారు.